ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 26.0 కనిష్ఠం : 21.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 3 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

బుధవారం 3 డిసెంబరు 2025



నిండుగా బుక్కపట్నం చెరువు



కృష్ణమ్మ పరుగులు

వంద రోజుల్లో 14.04 టీఎంసీల నీటి ప్రవాహం

చెరువులు, రిజర్వాయర్లకు జలకళ

వచ్చే ఏడాది ఫిబ్రవరిదాకా నీటి ప్రవాహం

చంద్రబాబు ముందు చూపుతోనే నీటి గలగలలు

పుట్టపర్తి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు ఫలించింది. ఉమ్మడి జిల్లాకు వరప్రదాయినిగా భావించే హంద్రీనీవా కాలువ ఆధునికీకరణతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. దీంతో ఉమ్మడిజిల్లాలోని చెరువులు, రిజర్వాయర్లు నీటితో తొణికిసలాడుతున్నాయి. నీటిని విడుదల చేసిన వంద రోజుల్లోనే హంద్రీనీవా పరిధిలోని చెరువులు, రిజర్వాయర్లు నిండిపోయాయి. ఇప్పటికే 14.04 టీఎంసీల నీరు ఉమ్మడి జిల్లాకు చేరింది. ఈక్రమంలోనే రెండో దశలో జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూరు ఉపకాలువ (పీబీసీ), కుప్పం కాలువతోపాటు మడకశిర ఉపకాలువలో కృష్ణమ్మ వడివడిగా పరుగులు పెడుతోంది. నీరు పుష్కలంగా ఉండటంతో జిల్లా రైతాంగం వ్యవసాయ పనుల్లో నిమగ్నమైంది.

కాలువ ఆధునికీకరణతోనే..

హంద్రీనీవా ద్వారా ఉమ్మడి జిలాలో అన్ని చెరువులకు నీరు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం హంద్రీనీవా కాలువ ఆధునికీకరణకు రూ.930 కోట్లు నిధులు విడుదల చేసింది. వంద రోజుల్లో పని పూర్తి కావాలనే లక్ష్యంతో రాత్రింబవళ్లు పని చేసి, దాదాపుగా 75శాతం లైనింగ్ పనులు పూర్తి చేశారు. జూలై 17న నంద్యాల జిల్లా మల్యాల పంప్‌హౌస్ వద్ద సీఎం చంద్రబాబు హంద్రీనీవా కాలువకు నీటిని లాంఛనంగా విడుదల చేశారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి రెండోవిడత కాలువకు ఆగస్టు 17న నీటిని విడుదల చేశారు. కాలువ ఆధునికీకరణ పనులతో కృష్ణమ్మ సాఫీగా ముందుకు సాగుతూ చెరువులు, రిజర్వాయర్లను పూర్తిగా నింపింది. ఇప్పటిదాకా జీడిపల్లి రెండో ప్రధాన కాలువలో 260 కిలోమీటర్ వద్ద నుంచి జిల్లాలోకి 14.04 టీఎంసీలు నీరు విడుదలైంది.

ఇదో రికార్డు

జీడిపల్లి రిజర్వాయర్ నుంచి రెండో దశలో ప్రధాన కాలువతోపాటు మడకశిర ఉపకాలువకు నీటి ప్రవాహంతో జిల్లాలోని చెరువులను నింపుతున్నాం. వంద రోజుల్లో జిల్లాకు 14.04 టీఎంసీ కృష్ణ జలాలు తరలివచ్చాయి. జిల్లాలో 60 చెరువులు నిండిపోగా 37 చెరువులకు నీటి ప్రవాహం సాగుతోంది. రెండో దశ ప్రధాన కాలువ కింద చెరువులు, రిజర్వాయర్లు నింపుతూ పుంగనూరు, కుప్పం కాలువల్లో నీరు సాగుతోంది. హంద్రీనీవా కాలువ ఆధునికీకరణ చేయడం వల్లే నీరు వేగంగా ముందుకు సాగుతోంది. ఫిబ్రవరి దాకా కాలువకు నీరు ఇస్తాం. హంద్రీనీవా చరిత్రలో వంద రోజుల్లో ఇంత భారీ నీరు ఇవ్వడం, చెరువులు నింపడం ఓ రికార్డు.

- రాజా స్వరూప్‌కుమార్, ఎస్‌ఈ, హెచ్ఎన్ఎస్ఎస్

వేగంగా.. సాఫీగా నీటి ప్రవాహం

కృష్ణా జలాలతో జిల్లాలో 183 చెరువులను నింపేలా ప్రణాళిక చేపట్టారు. రెండో దశలో జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. రోజుకు 1900 క్యూసెక్కుల నీటి ప్రవాహంతో జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులను నింపుకుంటే పుంగనూరు, కుప్పం ఉపకాలువలో నీటి ప్రవాహం సాగుతోంది. జిల్లాలోని గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి జలాశయాలను నీటితో నింపుతూ చెరువులకు నీరు ఇస్తున్నారు. ప్రధానంగా మడకశిర ఉపకాలువ కింద 103 చెరువులు ఉండగా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి రోజుకు 240 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాధాన్యత క్రమంలో మడకశిరలోని చెరువులకు నీరు ఇస్తున్నారు. జిల్లాలో రాప్తాడు, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో ఇప్పటిదాకా 3.01 టీఎంసీ నీటితో 60 చెరువులు నిండిపోగా 37 చెరువులకు నీటి ప్రవాహం కొనసాగుతూ ఇప్పటిదాకా 1.03 టీఎంసీల నీరు ఇచ్చారు. 86 చెరువులకు ప్రాధాన్యత క్రమంలో 0.7 టీఎంసీ నీరు ఇవ్వనున్నారు. వచ్చే ఫిబ్రవరిదాకా నీరు ఇచ్చే ప్రణాళిక చేపట్టారు. ఈనేపథ్యంలో జిల్లాలో వ్యవసాయం అనుబంధ రంగాలు, పారిశ్రామికాభివృద్ధి వేగంగా విస్తరిస్తోంది.



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న హంద్రీనీవా అధికారులు



పన్నుల శాఖ కార్యాలయం

ఎన్నేళ్లీ శిక్ష..?

పన్నుల శాఖలో ప్రమోషన్ల కోసం ఎదురుచూపు

- పదేళ్ల కిందట నకిలీ చలానాల బాగోతం
- కలకలం రేపిన రూ.కోటిపైగా సొమ్ము వ్యవహారం
- ఒకరు సస్పెన్షన్, 11మందికి ఇంక్రిమెంట్లు కట్
- దశాబ్దం గడిచినా కొనసాగుతున్న పనిష్మెంట్
- ఉద్యోగోన్నతుల కోసం కోర్టుకెళ్లిన డీసీటీఓలు, ఏసీటీఓలు

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పన్నుల శాఖలో పలువురు అధికారులు, ఉద్యోగులు ప్రమోషన్ల కోసం హైకోర్టు మెట్లెక్కారు. పన్నుల శాఖలో పదేళ్ల కిందట (2015లో) నకిలీ చలానాల బాగోతం కలకలం రేపింది. నకిలీ చలానాలతో రూ.కోటికి పైగా సొమ్ము తినేశారు. ఈ వ్యవహారం అప్పట్లో పెద్ద దుమారం రేపింది. అయితే ఈ బాగోతంలో తమకు సంబంధం లేకపోయినా చర్యలు తీసుకున్నారంటూ కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనుకూలంగా తీర్పు

నకిలీ చలానాల బాగోతాన్ని ఆ శాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. విచారణ చేపట్టడంతో పాటు అప్పట్లో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కీలకంగా వ్యవహరించిన జూనియర్ అసిస్టెంట్ వినాయక్‌పై సస్పెన్షన్ వేటు

(మిగతా 4వ పేజీలో...)

ఘనంగా గంధంపూజ



5 చాదర్ తీసుకెళ్తున్న మంత్రి సవిత, కలెక్టర్ శ్యాంప్రసాద్

రేపటి నుంచి వరి కొనుగోలు 5

కలెక్టర్ మాస్టారు..!



బోర్డుపై రాసి, విద్యార్థులకు బోధిస్తున్న కలెక్టర్

కలెక్టర్ శ్యాంప్రసాద్ ఉపాధ్యాయుడి అవతారమెత్తారు. బోర్డుపై రాసి, పిల్లలకు అర్థమయ్యేలా బోధించారు. వారిని పలు ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టారు. బుక్కపట్నంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయుడి అవతారమెత్తి పాఠాలు బోధించారు. పాముదుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, పదో తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టారు. బోర్డుపై రాసి, అర్థమయ్యేలా బోధించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు పిల్లలు సమాధానాలు చెప్పారు. విద్యార్థిని హారికతో పద్యాలు చదివించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, డీఈఓ కృష్ణప్ప, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ నరసింహులు, ప్రధానోపాధ్యాయురాలు వెంకటనరసమ్మ, బుక్కపట్నం ఎంఈఓ 1, 2 గోపాల్‌నాయక్, మోహన్‌బాబు పాల్గొన్నారు.

- బుక్కపట్నం, ఆంధ్రజ్యోతి

పారదర్శకంగా భూ రీసర్వే

- కలెక్టర్ శ్యాంప్రసాద్



భూ రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

బుక్కపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భూ రీసర్వే పనుల్లో పారదర్శకత పాటించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పాముదుర్తి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. సర్వే నోటీసులు సక్రమంగా అందుతున్నాయా? నోటీసుల్లో పేర్కొన్న తేదీ, సమయం మేరకే సర్వే జరుగుతోందా? అని అడిగి తెలుసుకున్నారు. అలాగే సర్వేకు భూ యజమానులు సహకరిస్తున్నారా అని అధికారులతో ఆరాతీశారు. గ్రామంలో భూమి ఉన్నా, బయట ప్రాంతాల్లో నివసించే భూయజమానులకు కూడా రీసర్వే సమాచారం నేరుగా చేరేలా చర్యలు తీసుకోవాలని స్థానిక రెవెన్యూ, సర్వే సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ స్వయంగా డిజటల్ రోవర్ ద్వారా జియో-కోఆర్డినేట్ల గుర్తింపు, బౌండరీ పరిశీలన, ఫీల్డ్ వెరిఫికేషన్ వంటి కీలక దశలను పరిశీలించారు. భూ రికార్డుల్లో ఏదైనా వ్యత్యాసం కనిపించినా, రైతుల నుంచి అభ్యంతరాలు వచ్చినా వెంటనే పరిష్కరించాలన్నారు. జాయింట్ ఎల్‌పీఎంలను ఎట్టి పరిస్థితులలోనూ రూపొందించవద్దు అని ఆదేశించారు. ప్రతి రైతుకు ప్రత్యేక ల్యాండ్ పార్సెల్ మ్యాప్(ఎల్‌పీఎం) రూపొందించాలన్నారు. చిన్న సమస్యలు ఉన్నా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీఓ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కాబా సహకారం

రూ.15లక్షలు విలువచేసే డ్రోన్ కెమెరాల అందజేత



డ్రోన్ కెమెరాలను ఎస్పీకి అందిస్తున్న కాబా చైర్మన్

పెనుకొండ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు తమవంతు సాయంగా కాబా(కొరియన్ అసోసియేషన్ ఇన్ బెంగళూరు, ఆంధ్రప్రదేశ్) డ్రోన్ కెమెరాలను జిల్లా పోలీసు శాఖకు అందించింది. స్థానిక సీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో రూ.15లక్షలు విలువచేసే డ్రోన్ కెమెరాలను ఎస్పీ సతీష్‌కుమార్‌కు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గత రెండు నెలల నుంచి ప్రతి స్టేషన్ పరిధిలో సీసీకెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యం నిస్తున్నామన్నారు. సత్యసాయిబాబా జయంతి సందర్భంగా 169సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇదే క్రమంలో కాబా రూ.15లక్షల విలువచేసే డ్రోన్ కెమెరాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ క్రమంలో కాబా చైర్మన్ జంగ్‌యంగ్‌హో తదితర సభ్యులకు ఎస్పీ శాలువ, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ నర్సింగప్ప, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సతీష్, రాజేష్, కాబా వైస్ చైర్మన్ జిన్‌హుయంగ్, రాబై హింగ్‌జి, కిమ్‌టీహైయప్, సీక్‌యంజిల్ పాల్గొన్నారు.

నేడు భక్తరహళ్ళి నరసింహస్వామి కల్యాణం

మడకశిర రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ భక్తరహళ్ళి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నరసింహస్వామి కల్యాణోత్సవం బుధవారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు కల్యాణోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. హనమద్ వ్రతం, పవమన హోమాలు ఘనంగా నిర్వహించారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఎవరికీ ఇబ్బంది రానియ్యం

- ప్రజలతో చర్చించాకే రిజర్వాయర్ నిర్మాణం
- చంద్రబాబు వల్లే తాగు, సాగునీరు
- బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

మంత్రికి వినతిపత్రం అందిస్తున్న స్థానికులు, సీపీఎం నాయకులు



సోమందేపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గుడిపల్లి రిజర్వాయర్‌తో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు రానీయబోమని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత మంగళవారం పేర్కొన్నారు. మండలంలోని గుడిపల్లి గ్రామంలో పాపిరెడ్డిపల్లి నుంచి తుంగోడు క్రాస్‌వరకు 7.5కి.మీ. మేర రూ.2.8కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, అధికారులతో కలిసి గుడిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై చర్చిస్తామన్నారు. పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించిన అనంతరమే రిజర్వాయర్ నిర్మాణంపై ఓ నిర్ణయానికి వస్తామన్నారు. దీనిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సీఎం చంద్రబాబు కృషి వల్లే రాయలసీమ జిల్లాలకు తాగు, సాగునీరు అందుతోందన్నారు. పెనుకొండ నియోజకవర్గానికి మరిన్ని పరిశ్రమలు రానున్నాయన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం వల్ల కియ, వాటి అనుబంధ సంస్థలు పెనుకొండ, హిందూపురం, మడకశిర ప్రాంతాలకు సాగు, తాగునీరు అందుతున్నాయని వెల్లడించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్లు, డ్రైన్లు నిర్మించామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చకు తాము

(మిగతా 4వ పేజీలో...)

శక్తి యాప్‌పై అవగాహన

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల భద్రతే లక్ష్యంగా రూపొందించిన శక్తి యాప్‌పై జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమా లు చేపట్టారు. శక్తి టీం సభ్యులు జిల్లాకేంద్రం లోని ఎనుమలపల్లి పీహెచ్‌సీ, కర్ణాటకనాగేపల్లి, పుట్టపర్తి, కదిరి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలకు ఆపద సమయంలో యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి మహిళ, బాలిక తప్పక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, నమోదు చేసుకోవాలని సూచించారు.



ఎనుమలపల్లి పీహెచ్‌సీలో పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న శక్తి టీం

ముగిసిన రైతన్నా... మీకోసం

ఇంటింటి ప్రచారం పూర్తి

నేడు రైతు సేవాకేంద్రాల్లో వర్క్‌షాప్‌లు

వరుసగా మూడు సీజన్ల యాక్షన్ ప్లాన్ తయారీ

కమిషనరేట్‌కు నివేదికలు 4

అనుకున్నట్లే

- సబ్జెక్టు టీచర్లులేని స్కూళ్లకు వలంటీర్లు
- అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పేరుతో 80 పోస్టులు 5
- ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

పది విద్యార్థుల ఫీజు చెల్లింపు

మంత్రి సత్యకుమార్ యాదవ్ ఔదార్యం

ధర్మవరం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల పరీక్షా ఫీజును రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెల్లించారు. 2,087 మంది విద్యార్థుల ఫీజులకు సంబంధించి రూ.2,60,875 చెక్కును బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌బాబు.. ఏడీ నబీరసూల్, ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్‌కు మంగళవారం అందజేశారు. ధర్మవరంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో హరీశ్‌బాబు మాట్లాడుతూ.. విద్యాభివృద్ధి కోసమే మంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుమన, ఉపాధ్యాయుడు రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.



పరీక్షా ఫీజుల చెక్కును ఎంఈఓలకు అందజేస్తున్న హరీశ్‌బాబు

ఎవరికీ ఇబ్బంది రానియ్యం

(3వ పేజీ తరువాయి)

సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం

గుడిపల్లి సజ్జగంట రంగనాథస్వామి ఆలయాభివృద్ధికి తనవంతు సహకరిస్తానని మంత్రి సవిత పేర్కొన్నారు. బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసిన ఆమె స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆలయాభివృద్ధికి సంబంధించి పలు అంశాలను వివరిస్తూ మంత్రికి వినతిపత్రాన్ని అందించారు.

ఆలయం, గ్రామం ఎక్కడికీ పోవు

రిజర్వాయర్‌ను నిర్మించి తమకు అన్యాయం చేయవద్దని గుడిపల్లి ప్రజలు మంత్రిని వేడుకున్నారు. ఇదే విషయమై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానికులు మంత్రికి వినతిపత్రాన్ని అందించారు. రిజర్వాయర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక పరిస్థితులను ఆమెకు వివరించారు. మంత్రి సవిత మాట్లాడుతూ గుడి, గ్రామం ఎక్కడికిపోవన్నారు. స్థల పరిశీలన తర్వాతే గుడిపల్లి రిజర్వాయర్ నిర్మాణ విషయాలు వెల్లడిస్తామన్నారు. ప్రస్తుతం ప్రతిపాదనలు మాత్రమే ప్రభుత్వానికి పంపామన్నారు. ప్రభుత్వ భూములు ఎక్కడుంటే అక్కడే సర్వే నిర్వహించి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపడతామన్నారు. గుడిపల్లిలో గ్రామసభలు నిర్వహించి మీ అభిప్రాయాలు తీసుకున్న తరువాతే ముందుకెళ్తామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గోరంట్ల మార్కెట్‌యార్డ్ చైర్మన్ శైలజ, టీడీపీ నాయకులు రంగేపల్లి వెంకటరమణ, కన్వీనర్ వెంకటేశులు, డీవీ ఆంజనేయులు, సూరి, కిష్టప్ప, సంజీవరెడ్డి, శరత్‌చంద్ర, రామకృష్ణ, శ్రీధర్, మాజీ సర్పంచ్ పెద్దసుబ్బన్న, సీపీఎం నాయకులు పెద్దన్న, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముగిసిన రైతన్నా... మీకోసం

ఇంటింటి ప్రచారం పూర్తి

నేడు రైతు సేవాకేంద్రాల్లో వర్క్‌షాప్‌లు

వరుసగా మూడు సీజన్ల యాక్షన్ ప్లాన్ తయారీ

కమిషనరేట్‌కు నివేదికలు

అనంతపురం అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచసూత్రాలతో లాభసాటి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా.. మీకోసం' ఇంటింటి ప్రచారం మంగళవారంతో ముగిసింది. గతనెల 24వతేదీ నుంచి ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం జిల్లాలోని అన్ని రైతు సేవాకేంద్రాల్లో స్థానిక రైతులతో వ్యవసాయ అధికారులు, సిబ్బంది వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఉమామహేశ్వరమ్మ.. వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.

జిల్లావ్యాప్తంగా ఇప్పటిదాకా రైతన్నా.. మీకోసం నిర్వహణ తీరుపై చర్చించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆఖరు రోజు రైతు సేవాకేంద్రాల్లో రైతులతో వర్క్‌షాప్ నిర్వహించి, ఈ ఏడాది రబీ, వచ్చే ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ తయారీపై సమాలోచనలు జరిపారు.

నేడు వర్క్‌షాప్‌లు

రైతన్నా.. మీకోసంలో భాగంగా ఆఖరు రోజు బుధవారం జిల్లాలోని అన్ని రైతు సేవాకేంద్రాల్లో రైతులతో వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేసి, పక్కాగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని నిర్ణయించారు. రైతు సేవా కేంద్రాలవారీగా తయారు చేసిన యాక్షన్ ప్లాన్‌ను క్రోడీకరించి, మండలాల వారీగా ప్రణాళికలు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి పంపనున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండలాల వారీగా వచ్చిన యాక్షన్ ప్లాన్‌ను క్రోడీకరించి, జిల్లా స్థాయి యాక్షన్ ప్లాన్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు పంపనున్నారు.

పీఏబీఆర్ గేట్లు బంద్

● కుడికాలువలో పెరిగిన ప్రవాహం

కూడేరు, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం రిజర్వాయర్ (పీఏబీఆర్) గేట్లను మంగళవారం బంద్ చేశారు. కుడికాలువకు నీటి విడుదలను పెంచడంతో రిజర్వాయర్ ప్రధాన గేట్లు బంద్ చేశారు. ప్రస్తుతం కుడి కాలువలో 650 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందని డీఈ వెంకటరమణ తెలిపారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి 670 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌లోకి వస్తోందన్నారు. రిజర్వాయర్ నుంచి దాదాపు 1000 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోందన్నారు. కుడికాలువ నీరు మంగళవారం రోజున కూడేరు మండలం దాటి రాప్తాడు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. కాలువ కింద దాదాపు 48 చెరువులను నింపడానికి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. కుడికాలువ గేట్లు మొరాయించడంతో నీటి విడుదలకు ఇబ్బందులు తలెత్తాయి. అదే సమయంలో రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో పెరగడంతో ప్రధాన గేట్లు ఎత్తి నీరు విడుదల చేశారు. కుడి కాలువ గేట్లను రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, నిపుణులు చాకచక్యంగా పైకి లేపి, నీటిని విడుదల చేశారు. దీంతో ప్రధాన గేట్లను బంద్ చేశారు.



కలగళ్ల గ్రామం వద్ద కుడి కాలువలో ప్రవహిస్తున్న నీరు

పూత.. జాగ్రత్త..

● మామిడిలో సస్యరక్షణతో అధిక దిగుబడులు

● వాతావరణం మారుతోంది.. అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్



పూత మొగ్గ దశలో మామిడి

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మామిడి తోటలు పూత దశకు వచ్చాయనీ, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్ సూచించారు. పూతను కాపాడుకుంటే మేలైన దిగుబడులు సాధించవచ్చని చెబుతున్నారు. మామిడిలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను ఆయన మంగళవారం వివరించారు. జిల్లాలో నవంబరులో కురిసిన వర్షాల కారణంగా మామిడితోటలు కాస్తా ఆలస్యంగా పూతకు వచ్చాయి. పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, కదిరి, గాండ్లపెంట, తలుపుల గోరంట్ల, తనకల్లు, ఓబుళదేవరచెరువు, నల్లమాడ తదితర మండలాల్లో 20వేల హెక్టార్లలో మామిడి సాగు చేస్తున్నారు. పూతదశలో ఉన్న మామిడితోటల రైతన్నలు మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సరైన జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. పూత ఒకేసారి రావడానికి మోనోక్రోటోపాస్ 1.6 ఎంఎల్, సల్ఫర్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పదిరోజుల తర్వాత ఇమిడి క్లోప్రిడ్ 0.5 ఎంఎల్, హెక్సాకోనజోల్ 2 ఎంఎల్, 13:0:45, 10 గ్రాములతోపాటు ఏదేని సూక్ష్మధాతువు మిశ్రమం 2 గ్రాములు లీటరు నీటికి కలిపి స్ప్రే చేయాలి. పదిరోజుల అనంతరం బోరాన్ 2 గ్రాములు సూక్ష్మధాతువు 2 గ్రాములు, కార్బండాజిమ్ గ్రాము చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. తేనెమంచు పురుగు కనిపిస్తే తోటలో ఇమిడాక్లోప్రిడ్ 0.5 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి స్ప్రే చేసుకోవాలి. పూతమొగ్గలపై మంచు చేరుతుండడంతో పూత నల్లగా మారిపోయి పిందెకట్టకుండా రాలిపోతుంటే హెక్సాకొనజోల్ 2 ఎంఎల్‌గానీ, తయోఫినేట్‌మిథైల్ గ్రాముగానీ 0.3 ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్ లీటరు నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలి.

పండు ఈగను అరికట్టాలి

మామిడి కాయలను ఆకర్షించి రైతులను నష్టపరిచే పండు ఈగ నివారణ చర్యలు ఇప్పటి నుంచే చేపడితే నష్టాలను తగ్గించుకుని, అధిక దిగుబడులు సాధించవచ్చు. ఇందుకు పండుఈగను ఆకర్షించే బుట్టలు అమర్చుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో మామిడితోటలు వారం రోజులుగా పూతదశలోకి వచ్చాయి. పూత ఆశాజనకంగా ఉంది. పూత పిందె దశలో సరైన సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. మామిడిపంటలో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై తోటల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేసి, రైతులకు సూచనలు ఇస్తున్నామని ఉద్యానవన శాఖాధికారి వివరించారు.



జిల్లా ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్

ఎన్నేళ్లీ శిక్ష..?

(3వ పేజీ తరువాయి)

వేశారు. ఆరోపణలు వచ్చిన 11మంది డీసీటీఓలు, ఏసీటీఓలకు రెండు ఇంక్రిమెంట్లు కట్ చేశారు. విచారణలో జూనియర్ అసిస్టెంట్ వినాయక్ తానే తప్పు చేసినట్లు ఒప్పుకున్నాడు. అలాగే నకిలీ చలానాలతో స్వాహా చేసిన సొమ్మునంతా తిరిగి చెల్లించారు. కాగా ఇదే బూచిగా చూపుతూ దశాబ్దం గడిచినా తమకు ప్రమోషన్లు ఇవ్వకపోవడం అన్యాయమంటూ సంబంధిత 11మంది అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మనస్తాపంతో మహిళా డీసీటీఓ రాజీనామా

కొందరు తమకు ఇంక్రిమెంట్లు కట్ చేశారని, మరికొందరు ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతుంటే, ఇదే విషయంలో ఓ మహిళా అధికారిణి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. డీసీటీఓగా ఉన్న అర్చనకు నిజాయతీ అధికారిణిగా పేరుంది. ఆమె ఎక్కడికైనా తనిఖీలకు వెళ్లినప్పుడు కాఫీ తాగితే దానికి కూడా తన సొంత డబ్బు చెల్లించేవారని సిబ్బంది చెబుతారు. ఇంత నిజాయుతీగా ఉన్న తనపై ఈ మచ్చ ఏంటి అని ఆమె మనస్తాపం చెందారు. ఈ క్రమంలో విజయవాడలో పనిచేస్తున్న సమయంలో ఏడాదిన్నర క్రితం ఉద్యోగానికి రాజీనామా చేశారు.

ఆ అకౌంటెంట్ ఎక్కడ..?

నకిలీ చలానాల బాగోతం విషయంలో కీలకంగా వ్యవహరించిన ఓ అకౌంటెంట్ ఎక్కడున్నాడనేది అంతుబట్టడం లేదు. ఆ వ్యవహారంలో అకౌంటెంట్ నారాయణస్వామిపై అనేక ఆరోపణలు వినిపించాయి. అకౌంటెంట్ నారాయణస్వామి ఎక్కడున్నాడో ఇప్పటివరకు అతీ గతీ లేదు. అప్పట్లో పోలీసులు సైతం సరిగా పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. అకౌంటెంట్‌ను సరిగా విచారించి ఉంటే నకిలీ చలానాల్లో ఎవరెవరి పాత్ర ఎంత ఉందో స్పష్టంగా తెలిసేదని ఆ శాఖ వర్గాలంటున్నాయి. అదే సమయంలో అనంతపురం సర్కిల్-2లో నగేష్ అనే ప్రైవేట్ వ్యక్తి బ్యాంకులకు చలానా డబ్బు తీసుకెళ్లేవాడు. అతన్ని విచారించినా పలు విషయాలు బయటకు వచ్చేవని, అతడి విచారణ విషయంలోనూ పోలీసులు అలసత్వం వహించారనే ఆరోపణలున్నాయి.

కోర్టు చురకలు

నకిలీ చలానాల కేసు ఇంకా అనంతపురం కోర్టులో కొనసాగుతుండగానే తమకు ఇంక్రిమెంట్లు కట్ చేశారని, ప్రమోషన్లు నిలిపివేశారని సంబంధిత అధికారులు హైకోర్టుకెళ్లారు. డీసీటీఓ ఏఎస్‌కే ప్రసాద్, ఏసీటీఓ సురేందర్‌రెడ్డి, డీసీటీఓ సుభాష్, ఏసీటీఓ నాగలక్ష్మమ్మ హైకోర్టుకు వెళ్లారు. ఈ విషయంపై కోర్టు సంబంధిత ఉన్నతాధికారులకు చురక అంటించినట్లు సమాచారం. నకిలీ చలానాల రూపంలో తీసుకున్న డబ్బు వసూళ్లయ్యాక, తప్పు చేసిన వారు ఒప్పుకున్నాక మిగతావారిని ఎందుకు శిక్షించాలని ప్రశ్నించినట్లు తెలిసింది. వారికి ప్రమోషన్ల విషయం పరిశీలించాలని ఆదేశించినట్లు సమాచారం. కాగా ప్రస్తుతం జిల్లా కేంద్రంలో పన్నుల శాఖలో జేసీ కార్యాలయంలో పనిచేస్తున్న వినాయక్ కూడా తనకు ప్రమోషన్ కావాలని కోరుతున్నట్లు సమాచారం.

ఆ విషయం నా దృష్టిలో లేదు

పదేళ్ల కిందట జరిగిన నకిలీ చలానా వివాదం నా దృష్టిలో లేదు. ఆ సమయంలో నేను ఇక్కడ లేను. ప్రమోషన్ల కోసం కోర్టుకు వెళ్లిన విషయం కూడా తెలియదు. ఉద్యోగోన్నతుల అంశం ప్రభుత్వం లేదా ఉన్నతాధికారులు పరిశీలిస్తారు.


-హేమ, పన్నుల శాఖ జాయింట్ కమిషనర్

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.



కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను

- సంయుక్త



'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహారాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

అఖండ 2
టికెట్ ధరల పెంపు

- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్ర్కీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గేట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాదరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్ర్కీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి వచ్చేది అప్పుడే



రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్గియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫోటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ

రణ్‌వీర్ క్షమాపణలు



కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజ్‌తో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

వినూత్నంగా వన్ బై ఫోర్



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.

ప్రాణాలు తీసిన పొగమంచు

కర్ణాటకలో డివైడర్‌ను ఢీకొట్టిన కారు
గుడ్డంపల్లికి చెందిన దంపతుల మృతి
దిక్కులేనివారైన ఇద్దరు కుమారులు


నుజ్జయిన మారుతీవ్యాన్


కృష్ణారెడ్డి, జ్యోతి (ఫైల్)

మడకశిర రూరల్, టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడ్డంపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి(41), జ్యోతి(35) దంపతులు కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వారి కుమారుడు మధుసూదన్ రెడ్డి, మరో వ్యక్తి చిదంబర రెడ్డి గాయపడ్డారు. పొగమంచు కారణంగా రోడ్డు కనిపించకపోవడంతో హొసకేరి వద్ద కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులు ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కృష్ణారెడ్డి రెండేళ్ల క్రితం బెంగళూరుకి వలస వెళ్లారు. అక్కడ కారు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. స్వగ్రామం గుడ్డంపల్లిలో బంధువుల పెళ్ళి ఉండంతో శనివారం తన భార్య, కుమారులు మధుసూదన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి వచ్చారు. పెద్ద కుమారుడు మధుసూదన్ రెడ్డికి బెంగళూరులో పరీక్ష ఉండటంతో మరో వ్యక్తి చిదంబర రెడ్డితో కలసి సోమవారం తెల్లవారు జామున కారులో బెంగళూరుకు బయలుదేరారు. గుడ్డంపల్లి నుంచి 30 కి.మీ. ప్రయాణించాక ప్రమాదం జరిగింది. తల్లిదండ్రుల మృతితో ఇద్దరు కుమారులు దిక్కులేనివారయ్యారు. మధు హొసన్‌లో ఇంటర్ చదువుతుండగా, విష్ణు బెంగళూరులో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఈ ప్రమాదంతో గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది.

రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి


గంగులప్ప (ఫైల్)

ఓబుళదేవరచెరువు, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగుంట్లపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి, టీడీపీ కార్యకర్త ఉగ్గన్నగారి గంగులప్ప (55) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బంధువులు తెలిపిన మేరకు గంగులప్ప గొర్రెలు మేపుకుంటూ రోడ్డు పక్కన ఉండగా గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీ కొట్టి ంది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను బంధువులు ఓడీచెరువు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య రమణమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు నరసింహమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌హెచ్‌ఓ వెంకటేష్ తెలిపారు. గంగులప్ప మృతి పట్ల ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని పేర్కొన్నారు.

రక్తస్రావంతో గర్భిణి..


గంగమ్మ (ఫైల్)

కణేకల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్యం గ్రామానికి చెందిన గర్భిణి గంగమ్మ(26) తీవ్ర రక్తస్రావంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. డి.హీరేహాళ్ మండలంలోని కల్యం గ్రామానికి చెందిన గంగమ్మను ఐదేళ్ల కిందట మాల్యంకు చెందిన సురేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఏడాదిన్నర వయసు కుమారుడు ఉన్నారు. గంగమ్మ ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి. సోమవారం మధ్యాహ్నం తీవ్ర కడుపునొప్పి రావడంతో కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఆసుపత్రికి వెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం పెద్దాస్పత్రికి తీసుకెళ్లారు. గర్భంలోనే బిడ్డ చనిపోయిందని వైద్యులు అబార్షన్ చేయగా గంగమ్మకు తీవ్ర రక్తస్రావమై మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు బంధువులు పేర్కొన్నారు. దీంతో బంధువులు శోకంలో మునిగిపోయారు.

డిప్యూటీ ఎంపీడీఓలకు పోస్టింగ్స్

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీఓలుగా ప్రమోషన్ పొందినవారికి పోస్టింగ్స్ ఇస్తూ కమిషనర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాకు కేటాయించిన వారిలో 30 మందికి మండలాలు కేటాయిస్తూ కలెక్టర్ ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈక్రమంలోనే కొందరు రిలీవ్ అయ్యి అక్కడ డిప్యూటీ ఎంపీడీఓలుగా బాధ్యతలు చేపట్టారు. మరో రెండు రోజుల్లో మిగిలిన వారు కూడా రిలీవ్ అయి వారికి కేటాయించిన మండలాల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న స్థానంలో పెండింగ్ వర్క్ పూర్తి చేస్తేనే రిలీవ్ చేస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు డిబార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): డిగ్రీ పరీక్షల్లో (3, 5వ సెమిస్టర్) ముగ్గురు డిబార్ అయినట్లు ఎస్కేయూ పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య జీవీ రమణ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో డిగ్రీ 3, 5వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు. 54 కేంద్రాల్లో మొత్తం 15000 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. ఇందులో గుంతకల్లులోని ఎస్వీ కళాశాలలో ఒకరు, అనంతపురం నగరంలోని ఎస్ఎల్ఎన్ కళాశాలలో ఇద్దరు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి డిబార్ చేసినట్లు ఆయన తెలిపారు.

చోరీ కేసులో రెండేళ్ల జైలు

కదిరి లీగల్/ ముదిగుబ్బ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ముద్దాయికి రెండేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కదిరి కోర్టు తీర్పు ఇచ్చినట్లు సీఐ శివరాముడు మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన మేరకు సుమారు ఐదేళ్ల కిందట ధర్మవరం రూరల్ ఉప్పినేసిపల్లి గ్రామానికి చెందిన భీమినేని అమరనాథ్‌నాయుడు ముదిగుబ్బ రైల్వేస్టేషన్ రోడ్డులోని రైల్వే క్వార్టర్స్‌లోని ఓ ఇంటిలో చోరీకి పాల్పడ్డాడు. మూడు తులాల బంగారు ఆభరణాలు, పదివేల నగదు చోరీ చేసినట్లు అప్పట్లోనే ముదిగుబ్బ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు ఆభరణాలు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వాదోపవాదాల అనంతరం కదిరి జుడిషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయాధికారి లోకనాథం సాక్ష్యాలను పరిశీలించి ముద్దాయికి శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ పద్మజ వాదనలు వినిపించారు.

పేలుడు పదార్థాల అపహరణ

పెద్దవడుగూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం సమీపంలో గల కార్తికేయ ఎంటర్‌ప్రైజెస్ గని సమీపాన గోదాములో నిల్వచేసిన దాదాపు రూ.8 లక్షల విలువగల జిలెటిన్ స్టిక్స్‌ను దుండగులు అపహరించారు. వీటిలో ఆర్డినరీ డిటోనేటర్లు, పవర్‌జెల్, డీకార్డ్ ఉన్నట్లు తెలుస్తోంది. సంబంధిత యజమాని తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భూగర్భ గనిలో ముడిఖనిజాన్ని వెలికి తీసేందుకు జిలెటిన్ సిక్స్ సమీపంలో ఉన్న గదిలో ఉంచామన్నారు. మంగళవారం ఉదయం వచ్చి చూడగా.. గదివెనుక భాగాన రంధ్రంచేసి అపహరించుకుపోయారన్నారు. సమాచారం అందుకున్న తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి క్లూస్ టీంతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పెద్ద మొత్తంలో జిలెటిన్ స్టిక్స్ చోరీ అవడం చర్చనీయాంశంగా మారింది.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ

అనుకున్నట్లే

సబ్జెక్టు టీచర్లు లేని స్కూళ్లకు వలంటీర్లు
అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పేరుతో జిల్లాకు 80పోస్టులు
ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

అనంతపురం విద్య, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సబ్జెక్టు టీచర్లు లేని స్కూళ్లలో విద్యా వలంటీర్లతో బోధన చేయించనున్నారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలలలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉండటంతో బోధన కుంటుపడుతూ వస్తోంది. ఈనేపథ్యంలో తొలుత విద్యార్థుల సంఖ్య ఆధారంగా మిగులు టీచర్లను గుర్తించి ఆయా పాఠశాలలకు పంపాలని ఆలోచించారు. అలా చేస్తే రాజకీయనేతల నుంచి ఒత్తిళ్లు వస్తాయని విరమించుకున్నారు. సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్న చోట వలంటీర్లను నియమించనున్నట్లు నెల రోజులు కిందటే 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన విషయం తెలిసిందే. అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పేరుతో వలంటీర్ల నియామకానికి కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. అనంతపురం జిల్లాకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 60, ఎస్‌జీటీ పోస్టులు 20 మంజూరు చేశారు. ఇందులో ఎస్‌ఏ తెలుగు 09, ఎస్‌ఏ హిందీ 20, ఎస్‌ఏ ఉర్దూ 3, ఎస్‌ఏ గణితం 7, ఎస్‌ఏ ఫిజికల్‌సైన్స్ 2, ఎస్‌ఏ బయాలజికల్‌సైన్స్7, ఎస్‌ఏ సోషియల్2, ఎస్‌ఏ సోషియల్ ఉర్దూ 5 పోస్టులు ఉన్నాయి.

8లోగా ఎంపిక ప్రక్రియ పూర్తి

ఈనెల 8లోగా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల(విద్యావలంటీర్లు)నియామక ప్రక్రియ పూర్తి చేయాలని కమిషనర్ విజయరామ రాజు ఆదేశాలు జారీ చేశారు. స్కూల్ అసిసెంట్లకు రూ.12,500, ఎస్‌జీటీలకు రూ.10,000 గౌరవ వేతనం సమగ్రశిక్ష ద్వారా అందించేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ నియామకాలను కలెక్టరు ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులు చేపట్టాల్సి ఉంది. ఈ నియామకం ఈ విద్యాసంవత్సరం ముగింపు వరకే కావడంతో ఎక్కడ అవసరమో అక్కడి లోకల్ అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వాలని, అక్కడ అభ్యర్థుల నుంచి పోటీ ఉంటే, మెరిట్‌కు ప్రాధాన్యం ఇచ్చి తీసుకోవాలని కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో వలంటీర్ల నియామకాలపై డీఈఓ ప్రసాద్‌బాబు కసరత్తు మొదలు పెట్టారు. రాష్ట్రస్థాయి నుంచే ఏ మండలం, ఏ పాఠశాలకు ఏసబ్జెక్టు వలంటీర్ పోస్టుఅని జాబితా పంపారు. అయితే ఆమేరకు అక్కడ అవసరం లేదని, మరో చోటకు అవసరముందని దీనిపై రాష్ట్ర అధికారులతో స్పష్టత తీసుకొని అవసరం ఉన్నచోటకు సర్దుబాటు చేస్తామని డీఈఓ తెలిపారు.

ఎట్టకేలకు..!

రేపు డీడీఓ కార్యాలయం ప్రారంభం
వర్చువల్‌గా ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న డీడీఓ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) అనంతపురం డీడీఓ (డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారి) కార్యాలయం ప్రారంభానికి రంగం సిద్ధం చేశారు. గత ప్రభుత్వంలో ప్రమోషన్లపై ఎంపీడీఓలను డీఎల్‌డీలుగా నియమించారు. కూటమి ప్రభుత్వం వారిని డీడీఓ లుగా మార్చింది. అలాగే ఆర్డీఓ స్థాయిలో కార్యాలయం కూడా ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఈ కార్యాలయంలోనే డీఎల్‌పీఓ (డివిజనల్ పంచాయతీ అధికారి), డ్వామా నుంచి ఏపీడీ (అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్) కార్యాలయాలు ఉండేలా చర్యలు చేపట్టింది. ఆగస్టు 19లోపే కార్యాలయ నిర్మాణ వివరాలను కమిషనర్ కార్యాలయానికి పంపించాలని జడ్పీ సీఈఓ ఆదేశాలు వచ్చాయి. అయితే అప్పటి వరకు డీడీఓగా ఎవరూ లేకపోవడంతో దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. అయితే అనంతరం డీడీఓగా నాగశివలీలా బాధ్యతలు చేపట్టడంతో కమిషనర్ కార్యాలయానికి సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో అధికారులు హడావుడిగా డీడీఓ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. జడ్పీ ఆవరణలో ఖాళీగా ఉన్న పలు భవనాలను పరిశీలించారు. అవి సరిపోకపోవడంతో అనంతపురం రూరల్ మండలంలో నూతనంగా నిర్మించిన సచివాలయం-2 భవనం డీడీఓ కార్యాలయం ఏర్పాటుకు అనువుగా ఉందని అధికారులు భావించి, అభివృద్ధి పనులు చేపట్టారు. అక్టోబరు 2న ఈ కార్యాలయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా ప్రారంభింపజేసి, వినియోగంలోకి తేవడానికి చర్యలు చేపట్టారు. అప్పుడు నెలకొన్న పరిస్థితుల కారణంగా ప్రారంభించలేకపోయారు. అయితే గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని డీడీఓ కార్యాలయాలు ప్రారంభించేలా ముహూర్తం ఖరారు చేశారు. ఏదో ఒక ప్రాంతం నుంచి డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా వీటిని ప్రారంభించనున్నారు. అనంతరం స్థానిక నాయకులు, జిల్లా అధికారులు స్థానికంగా ప్రారంభోత్సవానికి సంబంధించి చర్యలు చేపట్టనున్నారు.

ఏర్పాట్లు పూర్తి: వెంకటసుబ్బయ్య, జడ్పీ డిప్యూటీ సీఈఓ



డీడీఓ కార్యాలయానికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. సచివాలయ నూతన భవనంలో అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాం. స్థానిక నాయకులు, ఉన్నతాధికారుల సమక్షంలో గురువారం డీడీఓ కార్యాలయం గురువారం ప్రారంభిస్తాం.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

రెండు కేజీల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే ఆసుపత్రి వెనుక పాడుబడిన క్వార్టర్స్ వద్ద ఇద్దరు గంజాయి విక్రేతలను అరెస్టు చేసి, వారి నుంచి రూ.25వేలు విలువ చేసే గంజాయిని వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన సమావేశంలో అరెస్టు వివరాలను సీఐ మనోహర్ వెల్లడించారు. పట్టణంలోని ఇరానీ కాలనీకి చెందిన యాసిర్ అలీ, షేక్ మొహమ్మద్ మహారాష్ట్ర రాష్ట్రం థానే జిల్లా కోసాటౌన్ మురముర రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులతో గంజాయి కొనుగోలు చేశారు. పట్టణంలో వంద, రెండువందల గ్రాముల ప్యాకెట్లు చేసి విక్రయించాలని రైల్వే ఆసుపత్రి వెనుక పాతబడిన క్వార్టర్స్ ముళ్లపొదల వద్ద ఉన్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో యాసిర్ అలీ, షేక్ మొహమ్మద్‌ను అరెస్టు చేసి వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారనీ, త్వరలో వారిని అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ కొండయ్య, హెడ్‌కానిస్టేబుళ్లు నాగేశ్వర్‌రావు, తిమ్మయ్య, కానిస్టేబుళ్లు సునీల్, ఎల్లప్ప పాల్గొన్నారు.

యువకులపై గంజాయి బ్యాచ్ దాడి

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని దుర్గానగర్‌లో మంగళవారం రాత్రి గంజాయి సేవించిన బాబ్జాన్, అర్షద్, సందీప్ అటుగా వెళ్తున్న యువకులు నరేష్, సాయిపై దాడిచేసి, గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. మత్తులో ఇరువురుని దారుణంగా కొట్టి పరారైనట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. యువకులపై కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ దేవానంద్ తెలిపారు. సోమందేపల్లిలో గంజాయి మత్తులో యువకుల ఆగడాలకు అంతేలేకుండా పోతోందని స్థానికులు అంటున్నారు.

చిన్నపిల్లల్లో నాడీ రుగ్మతలను అరికట్టాలి

సర్వజన ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యవిభాగాధిపతి రవికుమార్

అనంతపురం వైద్యం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల్లో నాడీ రుగ్మతలను సకాలంలో గుర్తించి, తగిన వైద్యం అందించడం ద్వారా అరికట్టవచ్చునని అనంతపురం సర్వజన వైద్యశాల చిన్నపిల్లల వైద్యవిభాగాధిపతి ప్రొఫెసర్ రవికుమార్ పేర్కొన్నారు. వైద్యశాలలోని ధన్వంతరి హాల్లో రీహాబిలిటేషన్ డేను మంగళవారం నిర్వహించారు. 'శిశువుల నాడీ అభివృద్ధి ప్రోత్సాహం' అనే అంశంపై డాక్టర్ రవికుమార్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశానికి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ శంషాద్ బేగం హాజరై, మాట్లాడారు. నెలలు నిండని కాన్పు, తక్కువ బరువుతో జన్మించిన నవజాత శిశువుల మెదడు ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. తద్వారా అవయవాల వృద్ధి ఆగిపోయి, వైకల్యం బారిన పడతారన్నారు. చిన్నపిల్లలు, మాతృత్వ, ఎస్ఎన్‌సీయూ, డీఈఐసీ ఇలా అన్ని విభాగాలు పరస్పర సహకారంతో పనిచేస్తే శిశువుల నాడీ సంబంధిత సమస్యలను పరిష్కరించవచ్చని వివరించారు. పురిటి పిల్లలుగా ఐసీయూలో అడ్మిషన్ అయినవారికి పరీక్షలు నిర్వహించి సమస్యను గుర్తించి తగిన చికిత్సలందించాలని సూచించారు. ఎస్ఎన్‌సీయూ సరైన సమయంలో చికిత్స, తల్లిపాలు తాగేలా ప్రోత్సహించడం, కంగారు మాతృ సంరక్షణ, తల్లులకు సహాయపడాలన్నారు. అనంతరం రిహాబిలిటేషన్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యులు ప్రవీణ్, భాస్కర్ నాయక్, ఉదయ భాస్కర్, శంకర్ నారాయణ పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

అనంతలో అన్వే ద్రావిడ్

కూచ్‌బెహర్ ట్రోఫీ మ్యాచ్‌లో రాహుల్ ద్రావిడ్ తనయుడు


అన్వే ద్రావిడ్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రావిడ్ తనయుడు అన్వే ద్రావిడ్ అనంతపురంలో సందడి చేస్తున్నాడు. అనంత క్రీడాగ్రామంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న కూచ్‌బెహర్ ట్రోఫీ అండర్-19 క్రికెట్ మ్యాచ్‌లో కర్ణాటక జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఆంధ్రాతో జరుగుతున్న ఈ మ్యాచ్ రెండోరోజు మంగళవారం అన్వే ద్రావిడ్ 31 బంతుల్లో 13 పరుగులు చేశాడు. మ్యాచ్ తొలిరోజు సోమవారం టాస్ గెలిచి, బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్రా జట్టు 5 వికెట్లకు 300 పరుగులు చేసింది. ఆ స్కోరు వద్ద రెండోరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించింది. 415 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్రా బ్యాటర్లలో వీరారెడ్డి సెంచరీ (114)కితోడు కేఎల్ శ్రీనివాస్ (98), ఏఎన్‌వీ లోహిత్ (74), పరమ్‌వీర్ సింగ్ (70) రాణించారు. కర్ణాటక బౌలర్లు రతన్ 4, హిరేమత్ 3 వికెట్లు తీశారు. అనంతరం మొదటి ఇన్నింగ్ ప్రారంభించిన కర్ణాటక 62 ఓవర్లలో 176 పరుగులకు 5 వికెట్లు కోల్పోయింది. శివానంద (56), సిద్ధార్థ అఖిల్ (60) హాఫ్ సెంచరీలు చేశారు. రాహుల్ ద్రావిడ్ చిన్న కుమారుడు అన్వే ద్రావిడ్ 31 బంతుల్లో 13 పరుగులు చేశాడు.

ఘనంగా గంధంపూజ


గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న సజ్జద్ బాబా

పెనుకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిచెందిన స్థానిక బాబయ్యస్వామి దర్గాలో స్వామివారి మొదటి గంధంపూజ మహోత్సవం మంగళవారం రాత్రి 11 గంటలకు అట్టహాసంగా నిర్వహించారు. మొదటిగంధం పీఠాధిపతి సజ్జద్‌బాబా స్వగృహం నుంచి గంధం పళ్లాన్ని శిరస్సుపై ఎత్తుకుని డ్రమ్ములు, వాయిద్యాలు, పకీర్ల విన్యాసాలతో బాణసంచా పేల్చుతూ దర్గాకు చేరుకున్నారు. దర్గాలోని స్వామి సమాధికి గంధంతో పూజలు నిర్వహించారు. గంధంపూజలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

మంత్రి చాదర్ సమర్పణ

పెనుకొండ బాబయ్యస్వామి గంధం మహోత్సవం సందర్భంగా ప్రభుత్వం తరఫున మంత్రి సవిత మంగళవారం చాదర్ సమర్పించారు. దర్గా నిర్వాహకులు ముస్లిం సంప్రదాయ పద్ధతిలో మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం దర్గా పీఠాధిపతి సలావుద్దీన్ బాబా, మతపెద్దలు వెంటరాగా మంత్రి సవిత చాదర్‌ను దర్గాకు తీసుకెళ్లి స్వామి సమాధికి సమర్పించారు. అనంతరం ప్రార్థనలో పాల్గొన్నారు.

రేపటి నుంచి వరి కొనుగోలు

పౌరసరఫరాల శాఖ డీఎం

ఆంధ్రజ్యోతికి స్పందన

కణేకల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని గురువారం నుంచి కొనుగోలు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ డీఎం రమేష్‌రెడ్డి, జేడీఏ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'వర్రీ తొలగేనా' శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. కొనుగోలుకు సంబంధించి అధికారులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశమయ్యారు. అలాగే సిబ్బందికి కూడా వరి కొనుగోలుపై శిక్షణ అందించారు. సివిల్ సప్లై డీఎం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 25 వేల మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం 13 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఏ గ్రేడ్ రకం వరి క్వింటా రూ.2389, సాధారణ రకం రూ. 2369లుతో కొనుగోలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఏఓ జగదీష్ పాల్గొన్నారు.

2,83,430 మందికి పోలియో చుక్కలు

డీఐఓ డాక్టర్ శశిభూషణ్ రెడ్డి

అనంతపురం వైద్యం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 2,83,430 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి (డీఐఓ) డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో పల్స్ పోలియో నిర్వహణపై అధికారులు, సిబ్బందికి ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. డీఎంఓ ఓబులుతో కలిసి డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి మాట్లాడారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు పల్స్ పోలియో నిర్వహిస్తామన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డనుంచి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ టీకాలు వేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీపీ డాక్టర్ విష్ణుమూర్తి, డీపీఓ కిషోర్‌కుమార్, మేనేజర్ రాజు, ఎన్‌హెచ్‌ఎం జగన్నాథ్ పాల్గొన్నారు.

8న ఐటీఐ కళాశాలలో అప్రెంటిష్ మేళా

అనంతపురం విద్య, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఈనెల 8వతేదీన పీఎం అప్రెంటిష్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఐటీఐ చదివిన వారందరూ అర్హులన్నారు. పదో తరగతి, ఐటీఐ మార్కుల జాబితాలు, ఎన్‌టీసీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, కుల ధ్రువీకరణ పత్రం తీసుకు రావాలన్నారు. అర్హత ఆధారంగా ఆయా కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

14న ఎన్టీఆర్ ట్రస్టు మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

అనంతపురం విద్య, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్టు మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఈనెల 14వ తేదీన నిర్వహిస్తున్నట్లు ట్రస్టు మేనేజింగ్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పరీక్షలో అర్హత సాధించిన మొదటి 25 మంది బాలికలకు ఎన్టీఆర్ విద్యాసంస్థల ద్వారా ఉపకార వేతనాలు అందజేస్తామన్నారు. మొదటి 10 ర్యాంకులు సాధించిన వారికి నెలకు రూ.5వేలు, తర్వాత 15 ర్యాంకుల్లో నిలిచిన వారికి నెలకు రూ.3వేలు ఉపకార వేతనం ఎన్టీఆర్ బాలికల జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తయ్యేవరకు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల విద్యార్థినులు ఈనెల 12వ తేదీలోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 7660002627 నంబరులో సంప్రదించాలని నారా భువనేశ్వరి ప్రకటనలో వివరించారు.

పెళ్లి సంబంధాలు చూస్తున్నారని ఆత్మహత్య


నందిని (ఫైల్)

యాడికి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఇష్టం లేకపోయినా పెళ్లి సంబంధాలు చూస్తున్నారని ఉరేసుకున్న మండలంలోని జూటూరు గ్రామానికి చెందిన జూటూరు నందిని (23) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. ఎస్ఐ వెంకటరమణయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాడికిలోని కోటవీధికి చెందిన రఘునాథ్‌రెడ్డి కుమార్తె నందిని పీజీ వరకు చదివి ఇంటివద్ద ఉంటోంది. నందినికి తల్లిదండ్రులు ఇటీవల పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఇది ఇష్టం లేకపోవడంతో నవంబరు 29న నందిని ఇంట్లో ఉరేసుకుని, ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ నందిని మృతిచెందినట్లు తెలిపారు. నందిని తండ్రి రఘునాథ్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

గార్లదిన్నె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు (72) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పెద్దవడుగూరు మండలం కండ్లగూడురు గ్రామానికి చెందిన నాగమ్మ కుమారుడు కేశవరెడ్డితో కలిసి ఈనెల 30న అనంతపురం నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయల్దేరింది. గార్లదిన్నె మండలం తిమ్మంపేట సమీపంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

టమోటా కిలో రూ.35

అనంతపురం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.35తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 1200 టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. అదేవిధంగా టమోటా కిలో కనిష్ఠ ధర రూ.20, సరాసరి ధర రూ.27తో విక్రయాలు జరిగాయని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు దత్త పౌర్ణమి వేడుకలు

ధర్మవరం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుడంపల్లి క్రాస్‌లో ఉన్న ధర్మశాస్త్ర కాశీనాయన ఆశ్రమంలో దత్త పౌర్ణమి వేడుకలను గురువారం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు కణేకంటి శివారెడ్డి, శంకరచౌడప్ప మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటలకు గోపూజ, అభిషేకాలు, భజన కార్యక్రమాలు, ఉపన్యాసాలు, మహామం గళహారతి, అన్నదానం జరుగుతాయన్నారు. కావున ప్రజలందరూ తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

నేటి నుంచి గ్రామ సభలు

నంబులపూలకుంట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గత యేడాది ఏప్రిల్ 1నుంచి ఈ యేడాది మార్చి 31 వరకు మండల పరిధిలో చేపట్టిన పనులపై ఈ నెల 3నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పార్థ సారథి, ఈసీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారు మంగళవారం మాట్లాడారు. ఈ నెల 3న టీఎన్‌పల్లి, 4న మర్రికొమ్మదిన్నె, పడమర నడింపల్లి, ధనియాన్‌చెరువు, 5న వంకమద్ది, 11న వెలిచెలమల, ఎదురుదొన, 13న మేకలచెరువు, 16న పెడబల్లి, 19న ఎన్పీకుంట, 20 పి.కొత్తపల్లి, 26న గౌకనపేట, 27న తిమ్మమ్మమర్రిమాను, 31న బలిజపల్లి గ్రామసభలు నిర్వహి స్తామన్నారు. గత నెల 26నుంచి ఈనెల 20వరకు సోషియల్ ఆడిట్ బృందం పరిశీలించిన విషయాలను గ్రామసభల్లో వెల్లడిస్తా మన్నారు. అభ్యంతరాలపై ఫిర్యాదులు ఇవ్వవచ్చని వారు తెలిపారు.

నేడు ఎమ్మెల్యేల పర్యటన

గాండ్లపెంట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా బుధవారం నిర్వహిస్తున్న రైతన్నా... మీ కోసం' కార్యక్రమానికి కురుమామిడి సచివాలయంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొంటున్నట్లు వ్యవసాయ అధికారి షాదాబ్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా ఏడు సచివాలయాలలో నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ఏపీఏఐఎంఎస్ యాప్‌పై అవగాహన, ఈ యాప్ వల్ల రైతులకు ఉపయోగాలు, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, అన్నదాత సుఖీభవ, పీయం కిసాన్ వంటి పథకాలు, వివిధ సంక్షేమ పథకాలను వివిధ శాఖల అధికారులు వివరిస్తారని తెలిపారు. కురుమామిడి సచివాలయంలో ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. కావున మండల స్థాయి నాయకులు, అధికారులు , రైతులు తప్పక హాజరు కావాలని ఆయన తెలిపారు.

●నల్లమాడ: మండలకేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఆవరణంలో బుధవారం నిర్వహించే రైతన్నా.. మీకోసం' కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూటమినాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఆయన కోరారు.

వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ


భూమి పూజ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎంశేఖర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు

ధర్మవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీ ఎం శేఖర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు మంగళవారం భూమి పూజ చేశారు. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు పట్టణంలోని కాలేజ్ సర్కిల్‌లో వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ధర్మవరం ప్రజలు స్మరించుకునేలా ఈనెల 11న కాలేజ్ సర్కిల్‌లో వాజ్‌పేయి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు వారు తెలిపారు.

పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించాలి

● సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి

ధర్మవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 40 వార్డుల లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా ప్రతి ఒక్కరు చూడాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు సూచించారు. పట్టణంలోని ఎన్జీఓహోంలో మంగళవారం ఆ పార్టీ పట్టణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముసుగు మధు మాట్లాడుతూ...వార్డులలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ప్రధానంగా వీధి లైట్లు, డ్రైనేజీ, రోడు సమస్యలతోపాటు చేనేత కార్మికుల సమస్యలు, కార్మికుల ఆత్మహత్యల గురించి, నేతన్న భరోసా వెంటనే నేతన్నల ఖాతాల్లోకి జమయ్యేలా సీపీఐ పోరాటాలు చేస్తోందన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, సహాయ కార్యదర్శి రవికుమార్, చేనేత కార్మికసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనారాయణ, వెంకటస్వామి, నాయకులు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళను ఏమార్చి నగదు అపహరణ

నల్లచెరువు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో మంగళవారం బ్యాంక్ వద్దకు వచ్చిన మహిళను ఏమార్చి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె వద్ద నుంచి నగదును కాజేశారు. బాధితురాలు రమణమ్మ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలపరిధిలోని పులిమివాండ్లపల్లికి చెందిన ఎర్రగొండ రమణమ్మ తాకట్టుపెట్టిన బంగారాన్ని విడిపించుకునేందుకు మంగళవారం బ్యాంక్‌కు వచ్చింది. ఓచర్ రాసుకొని నగదు డిపాజిట్ కోసం క్యూలైన్‌లో నిలబడింది. అయితే ఆమె నగదును డిపాజిట్ చేస్తుండగా క్యూలైన్‌లో ఆమె వెనుకే నిలుచున్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు ఓచర్‌లో సంతకం తప్పుగా ఉందంటూ ఆమెను వెనుకకు పిలిచాడు. ఆమె చేతిలోని పాస్‌బుక్‌ను, నగదును తన చేతిలోకి తీసుకున్నారు. కొద్ది సేపటికే మళ్లీ వాటిని ఆమె చేతికి ఇచ్చి వెళ్లిపోయారు. అనంతరం ఆమె డిపాజిట్ చేయడానికి క్యాషియర్ వద్దకు వెళ్లింది. ఓచర్‌లో రూ.52, 000 ఓచర్ రాసి ఉంది. కానీ ఆమె ఇచ్చిన నగదులో అందులో రూ. 18500 తక్కువ ఉందని క్యాషియర్ తెలిపారు. వెంటనే పాస్‌బుక్ తీసుకున్న వ్యక్తి కోసం వెతగ్గా అక్కడ లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన రమణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు రంగప్రవేశం చేసి, బ్యాంక్‌లోని సీసీ పుటేజీను పరిశీలించి దుండగులను గుర్తించే పనిలో ఉన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

ధర్మవరం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంట గ్రామంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మంగళవారం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిం చారు. ఈ శిబిరాన్ని ఎన్‌ఎస్‌ఎస్ డైరెక్టర్ మల్లికార్జున పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో ప్లాస్టిక్, వ్యర్థపదార్థాలను, పిచ్చిమొక్కలను తొలగించారు. పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ చేపట్టారు. గ్రామసర్పంచ్ అంగజాల నాగవేణి, నాయకులు అంగజాల రాజు, పంచాయితీ కార్యదర్శి రామగౌని మురళీగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.


స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

అస్తవ్యస్తంగా అంగన్‌వాడీల నిర్వహణ

● కొరవడిన అధికారుల పర్యవేక్షణ


మూతపడిన బావుచెరువుపల్లి అంగన్‌వాడీ కేంద్రం

అమడగూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల అంగన్‌వాడీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పడానికి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వాలు నడుపుతున్న అంగన్‌వాడీల వ్యవస్థ పనితీరు మండలంలో గాడి తప్పుతోంది. మండల వ్యాప్తంగా మెయిన్ సెంటర్‌లు 31, మినీ సెంటర్లు 28 ఉన్నాయి. వీటిలో పలు కేంద్రాలను తెర వడం లేదని ఆయా గ్రామాల ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టి కాహారాన్ని సరిగా అందివ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మండలవ్యాప్తంగా ఏడు నెలల నుంచి మూడేళ్ల వరకు వయస్సు వరకు 532 మంది పిల్లలు ఉన్నారు. అలాగే ప్రీ స్కూల్ పిల్లలు మూడేళ్ల నుం ఆరేళ్ల వయస్సు వరకు 413 మంది ఉన్నారు. మండలంలోని 17 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, 34 అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇక మిగిలిని ఎనిమిది కేంద్రాలను ఇతర ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. అన్ని సౌకర్యాలు ఉన్నా పలు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తు న్నారు. అలాగే పలు చోట్ల గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందించే పౌష్టికాహార పదార్థాల్లో కోత వేసి అందిస్తున్నారనీ ప్రజలు అంటున్నారు. పలు కారణాలు చెప్పి తప్పించుకుంటున్నారని అంటున్నారు. దీంతో పాటు పిల్లలు ఉన్నా....ప్రస్తుతం పిల్లలు లేరనే సాకుతో సెంటర్ మూసివేయడం సరికాదని ప్రజలు తెలుపుతున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని బావుచెరువుపల్లిలో గత వైసీపీ పాలనా కాలంలో పిల్లలు లేరని ఇక్కడి అంగన్‌వాడీ కార్యకర్తను మహమ్మదాబాద్ అంగన్‌వాడీ కేంద్రానికి అటాచ్ చేశారు. ఆమె మహమ్మదాబాద్‌లో పనిచేస్తూ బావుచెరువు పిల్లలకు సేవలు అందించడంలో దూరమయ్యారని గ్రామస్థులు తెలుపుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో ముగ్గురు పిల్లలు, ఇద్ద బాలింతలు ఉన్నారనీ, ఇప్పటికైనా కేంద్రాన్ని నడపాలని వారు కోరుతున్నారు. అస్తవ్యస్తంగా మారిన అంగన్‌వాడీ కేంద్రాలపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి, సక్రమంగా నడిచేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పలుమార్లు అధికారులకు తెలియజేశాం



పిల్లలు ఉన్నారు... గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం తిరిగి నడపాలని పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా కేంద్రాన్ని ప్రారంభించి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలదే. గ్రామంలో ప్రతి ఒక్కరూ. వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు, ఇప్పటికైనాఅధికారులు స్పందించి సెంటర్ ప్రారంభించి పిల్లలకు సేవలు అందిచాలి.

-భాగ్యమ్మ, బావుచెరువుపల్లి

ప్రత్యేక నిఘా ఉంచుతాం

మండల వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ మెయిన్, మినీ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. అన్ని కేంద్రాలు సమయపాలనతో పనిచేసేలా చూస్తాం. ఏ కేంద్రమైన సరిగా పని చేయడం లేదని నా దృష్టికి ఫిర్యాదులు వస్తే పరిశీలించి తగు చర్యలు చేపడతాం.

గాయత్రీదేవి, సీడీపీఓ

పీఎంఏవై 2.0ను సద్వినియోగం చేసుకోండి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న పరిటాల శ్రీరామ్, టీడీపీ నాయకులు

ధర్మవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి అవాస్ యోజన(పీఎంఏవై2.0) పథకం కింద జియోట్యాగింగ్ చేయని వారికి ఈ నెల 14 వరకు అవకాశం ఉందని, దీనిని సద్వినియోగం చేసుకోవా లని టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ సూచించారు. పీఎంఏవై 2.0పై స్థానిక ఎర్రగుంట టీడీపీ కార్యాలయంలో ఆయన పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరు తమ పరిధి లోని సచివాలయాల్లో గృహ నిర్మాణానికి ధరఖాస్తు చేసుకోవాలన్నారు. హౌసింగ్ ఇంజనీరింగ్ సిబ్బంది ద్వారా తమ స్థలాల్లో జియో ట్యాగింగ్ చేయించుకోవడం తప్పని సరి అని ప్రజలకు అవగాహన కల్పించాలని నాయకులకు సూచించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఇళ్లకు జియో ట్యాగింగ్ అన్నది తప్పని సరి అని లేకపోతే లబ్ధిదారులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వీటిపై నాయకులు, కార్యకర్తలు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఎవరు నష్టపోకుం డా చూడాలని పరిటాలశ్రీరామ్ సూచించారు. అదేవిధంగా నియోజ కవర్గ పరిధిలో ఏడుగురికి మంజూరైన రూ.4.77 లక్షలు విలువైన చెక్కులను ఆయన టీడీపీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాటమయ్య, చింతలపల్లి మహేశ్‌చౌదరి, బీరే గోపాలక్రిష్ణ, పరిశే సుధాకర్, సంధా రాఘవ, నాగూర్ హుస్సేన్, చింతపులుసు పెద్దన్న, పురుషోత్తంగౌడ్, రాళ్లపల్లి షరీఫ్, జింకా పురుషోత్తం, అంబటి సనత్, కొత్తపేట ఆది, విజయ్ చౌదరి, మాధవరెడ్డి, కేశగాళ్ల శీన, చట్టా లక్ష్మీనారాయణ, కరెంటు ఆది, అస్లాం, అడ్రమహేశ్, వరదరాజులు, మార్కెట్ రహీం పాల్గొన్నారు.

వైద్యసేవలు మెరుగుపడాలి: కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవల మెరుగుపడాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్య పరీక్షలు, మందులు, అత్యవసర సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీసీహెచ్ఎస్, డీఎంహెచ్ఓకి సూచించారు. భవన నిర్మాణాల వేగం పెంచాలన్నారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ మధుసూదన్, డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం, వైద్యాధికారులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా ఈనెల 5న నిర్వహించనున్న మెగా పీటీఎం విజయవంతం చేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రకటనలో కోరారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించాలన్నారు.

లో ఓల్టేజ్ సమస్యకు పరిష్కారం

ధర్మవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): .పట్టణంలోని సాయినగర్‌లో ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న లో ఓల్టేజ్ సమస్యను నూతన ట్రాన్స్‌ఫార్మర్‌తో పరిష్కరించినట్టు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. స్థానిక సాయినగర్‌లో మంగళవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసి శాశ్వత పరిష్కారం చూపినట్టు ఆయన తెలిపారు. సాయినగర్‌లో లో ఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్టు మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి ప్రజలు తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారని హరీశ్‌బాబు తెలిపారు. అదేవిధంగా సాయినగర్‌లో పలు వీధులలో గత వైసీపీ హయాంలో సగం వరకు రోడ్లు వేసి అసంపూర్తిగా వదిలేశారని అన్నారు. దీనిపై ప్రజల విన్నపం మేరకు ఆ పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎంశేఖర్, నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వేను వేగవంతం చేయాలి: ఆర్డీఓ

గాండ్లపెంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని మండలంలోని సర్వేయర్లు, రెవెన్యూ అధికారులకు ఆర్డీఓ వీవీఎస్ శర్మ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సర్వేయర్లు, రెవెన్యూ అధికారుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. మండలంలో రీ సర్వే ప్రక్రియపై ఆరా తీశారు. మండలంలోని వేపరాల పంచాయతీలో రీ సర్వే ప్రక్రియ జరుగుతోందని మండల సర్వేయర్ చంద్న తెలిపారు. ఇప్పటికే వేపరాల, తాళకాలువ, సీఎం తండా, చిన్నక్కగారిపల్లిల్లో రీ సర్వే పూర్తి అయిందని, సర్వే చేసిన భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతులకు డీ-2 నోటీసులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. వారం రోజుల్లో వేపరాల పంచాయతీ పూర్తి చేయాలని సర్వేయర్లుకు ఆర్డీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాబు రావు, వీఆర్ఓ జాఫర్‌ఆలి, వీఆర్ఏలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రైతులకు పండ్ల మొక్కల పంపిణీ


రైతుకు పండ్ల మొక్క అందజేస్తున్న ఆర్డీఓ వీవీఎస్ శర్మ

గాండ్లపెంట, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కటారుక్రాస్‌లోని రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఆర్డీఓ వీవీఎస్ శర్మ, వ్యవసాయ శాఖ ఏడీ సనావుల్లా ముఖ్యఅతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రాయలసీమలోని మెట్ట ప్రాంతం పండ్ల మొక్కల సాగు అనుకూలమని రెడ్స్ సంస్థ రైతులకు ఉచితంగా అందిస్తోందని తెలిపారు. రైతులకు నాలుగేళ్ల నుంచి నాలుగు లక్షల మొక్కలు పంపిణీ చేసినట్లు రెడ్స్ సంస్థ డైరెక్టర్ బానూజ తెలిపారు. అలాగే పండ్లమొక్కల పెంపకంపై సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన రైతులకు పండ్ల మొక్కలను పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి షాదాబ్, రైతులు పాల్గొన్నారు.

నేడు నేలకోటలో వైద్యశిబిరం

ధర్మవరం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలకోట గ్రామంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు సంస్కృతి స్వచ్ఛంద సంస్థ, బెంగుళూరు వైట్‌ఫీల్డ్‌కు చెందిన వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం నేలకోటలోని గ్రామ సచివాలయం వద్ద ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహాసభలను విజయవంతం చేయండి

● ఏపీ మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల సమాఖ్య నాయకులు


సీఐటీయూ మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ధర్మవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరిగే ఆలిండియా సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు స్థానిక పీఆర్‌టీలోని వాటర్ ట్యాంక్ వద్ద మంగళవారం మున్సిపల్ కార్మికసంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశానికిఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అయూబ్‌ఖాన్, అనంతపురం జిల్లా మున్సిపల్ కార్మిక సంఘం కోశాధికారి ఆదినారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల భవిష్యత్తులో కార్మికులు ఎదుర్కొనే సమస్యల గురించి వారు చర్చించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణను కలిసి పారిశుధ్యం, ఇంజనీరింగ్ కార్మికులకు తల్లికి వందనంతోపాటు అన్ని ప్రభుత్వ పథకాలు అందజేయాలని, జీఎం నెంబరు 36 ప్రకారం జీతాలు చెల్లించాలనే పలు సమస్యలను వివరించారు. ఈనెల 10వ తేదీలోగా జీతాలు రాకుంటే 11వ తేదీ సమ్మె నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా నాయకురాలు పెద్దక్క, రెగ్యులర్ కార్మిక సంఘం నాయకులు పుల్లన్న, మున్సిపల్ కార్మికులు బాబు, ముకుంద, బొగ్గునాగరాజు, అనిల్, దస్తగిరి పాల్గొన్నారు.

● తనకల్లు : విశాఖపట్టణంలో ఈ నెల 31నుంచి జనవరి 4వరకు నిర్వహించే సీఐటీయూ అఖిలభారత 18వ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల నాయకులు కోరారు. మండలకేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సంబంధిత పోస్టర్లను విడుదల చేశారు. జనవరి 4న బహిరంగ సభలో కార్మికులు, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సీఐటీయూ మండల నాయకులు శివన్న, ఒంటెద్దు వేమన్న, నరసింహారెడ్డి, ఆంజి, భవన నిర్మాణ కార్మికులు వెంకటేష్ గోవిందు, శ్రీనివాసులు, వీవీ రమణ, ఎస్‌వీ రమణ పాల్గొన్నారు.

వారంలో రెండు రోజులు

'డయల్ యువర్ ఎస్ఈ'


కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఈ సంపత్ కుమార్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వారంలో రెండురోజులు 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వి ద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ తెలిపారు. వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం డయల్ యు వర్ ఎస్ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో విద్యుత్ సమస్యలను సం బంధిత సిబ్బంది ఎప్పటికటప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. విద్యుత్ వినియోగదారుల్లో సానుకూల దృక్ప థం తీసుకురావడానికి ప్రతి మంగళ, శుక్రవారాల్లో జిల్లాలోని వినియోగదారుల సమస్యలపై డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు 8555287250 నంబర్‌కు ఫోన్ చేసి, సమస్యలు తెలియజేయవచ్చన్నారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో 22 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిష్కరించాలని అధికారులను ఎస్ఈ ఆదేశించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ధర్మవరం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో మంగళవారం ఇంటర్నల్ స్క్వాడ్ అధికారి, హిందూపురం ఏడీఏ క్రిష్ణయ్య ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద బాలాజీ ఫర్టిలైజర్స్, వైటీఆర్ అగ్రి సొల్యూషన్స్, మన గ్రోమోర్, సిరివెంకట్ ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఉన్న స్టాకు వివరాలు, విత్తనాలు, ఎరువుల తూకాలు, అనుమతులు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సిరి వెంకట్ ఫర్టిలైజర్ దుకాణంలో ఎరువుల నిల్వలో వ్యత్యాసం రావడంతో రూ.1,64,500లక్షల విలువ ఉన్న ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రైతుకు ఎరువులు, మందులను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే విక్రయించా లని, ఇష్టానుసారంగా విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని దుకాణాల యాజమానులను హెచ్చరించారు. ఆయన వెంట ఏఓ ముస్తఫా పాల్గొన్నారు.

స్కూల్ బస్సులు కండిషన్‌లో ఉండాలి

● డ్రైవర్లకు ఆర్టీఓ సూచన


స్కూల్ బస్సులో అగ్నిమాపక పరికరాలను తనిఖీ చేస్తున్న ఆర్టీఓ రాణి

ధర్మవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతి స్కూల్ బస్సును డ్రైవర్లు కండీషన్‌లో ఉంచుకోవాలని ఆర్టీఓ రాణి సూచించారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లోని ఆర్టీఓ కార్యాలయ ఆవరణంలో మంగళవారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ప్రైవేటు స్కూల్ బస్సులను ఆమె తనిఖీ చేశారు. బస్సులలో ఉన్న అత్యవసర ద్వారం, ఫైర్ ఎక్యూప్‌మెంట్స్, ఫైర్ అలారం తదితర వాటిని పరిశీలించారు. అనంతరం డ్రైవర్లకు నిబంధనలు, సూచనలు వివరించారు. డ్రైవర్లు బస్సులను రోడ్డుపైకి తెచ్చేటప్పుడు కండిషన్ చూసుకోవాలన్నారు. స్కూల్ బస్సులలో పాఠశాల లకు వచ్చే పిల్లలు ఉంటారు కనుక అతివేగంగా నడపరాదని సూచించారు. డ్రైవింగ్ చేసే సమయంలో మద్యం తాగరాదని హెచ్చరించారు.

'పొదుపు సంఘాలను బలోపేతం చేయాలి'


వార్షిక మహాసభలో మాట్లాడుతున్న ఏపీఎం సూర్యనారాయణ

గాండ్లపెంట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలను బలోపేతం చేయాలని ఏపీఎం సూర్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ప్రగతి మండల పరస్పర సహాయ సహకార సంఘం 28వ వార్షిక మహాసభలను మంగళ వారం ఘనంగా నిర్వహించారు. మండల సమాఖ్య వార్షిక మహాసభ కార్యక్రమంలో భాగంగా 2024-25 నివేదిక, లావాదేవీల ఆడిట్, చేపట్టిన పనుల వివరాలు వివరించారు. 2025- 26 సంవత్సరంలో చేపట్టబోవు కార్యాచరణ ప్రణాళికపై సభ్యులతో చర్చించారు. అలాగే నూతన పాలకవర్గాన్ని ఎంపిక చేశారు. సమాఖ్య అధ్యక్షురాలిగా శైలజ, కార్యదర్శిగా మౌనిక, కోశాధికారిగా ఈశ్వరమ్మ, ఉపాధ్యక్షురాలిగా సుజాతను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. పొదుపు సంఘాలు బలోపేతం చేయాలని, ఆర్థికంగా వెనుకబడిన వారికి మహిళా సంఘం ద్వారా రుణాలు అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరి, కార్యదర్శి రాములమ్మ, సీసీలు షాకీర్, ప్రసాద్, నిర్మలమ్మ, రఘునాథ రెడ్డి, వీవోలు, వీవో లీడర్లు, వీఓఏలు, వీఓఏ లీడర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 260 మందికి పరీక్షలు

ముదిగుబ్బ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదే శాల మేరకు మండల పరిధిలోని కొండగట్టుపల్లిలో సంస్కృతి స్వచ్ఛంద సంస్థ, బెంగళూరు వైట్‌ఫీల్డ్‌కు చెందిన వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సచివాలయం నిర్వహించిన ఈ శిబిరానికి ధర్మవరంలోని మంత్రి కార్యాలయ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు హాజరయ్యారు. ఈ శిబిరంలో మహిళలు120 మంది, పురుషులు 140 మంది కలిపి మొత్తం 260 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో గ్రామీణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా మంత్రి కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ భరణి బృందం, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కౌశల్ రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థి


విద్యార్థి చరణ్‌తేజ్‌ను అభినందిస్తున్న హెచ్ఎం, టీచర్లు

ధర్మవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కౌశల్ సైన్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి చరణ్‌తేజ్ ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం మేరీవరకుమారి తెలిపారు. కొత్తచెరువులో నవంబరు 27న జరిగిన కౌశల్ సైన్స్ ప్రతిభాన్వేషణ జిల్లా స్థాయి పోటీలలో చరణ్‌తేజ్ ప్రతిభ కనబరచినట్టు తెలిపారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి చరణ్‌తేజ్ తిరుపతిలో ఈ నెల 27న జరిగే రాష్ట్రస్థాయి కౌశల్ సైన్స్ పోటీలలో పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు. ఈ విద్యార్థి చరణ్‌తేజ్‌ను హెచ్ఎంతోపాటు సైన్స్ ఉపాధ్యాయులు మల్లికార్జున, నజీర్ తదితరులు అభినందించారు.

రేపు దత్త జయంతి

పెనుకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దక్షిణషిర్డీగా పేరుగాంచిన షిర్డీసాయిమందిరంలో దత్త జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు అర్చకులు సుబ్రహ్మణ్య శాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, మహన్యాసపూర్వక, ఏకవార రుద్రాభిషేకం, సహస్ర నామార్చన ఉంటాయన్నారు. జపాలు, గణపతి, నవగ్రహ, మృత్యుంజయ, సాయినాథ, దత్తాత్రేయ, రుద్ర స్వాహాకార హోమాలు, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వినియోగం, అన్నసంతర్పణ, అఖండ సాయినామసంకీర్తన తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మంగళవారం అర్చకులు సుబ్రహ్మణ్యశాస్త్రి, ఫణీంద్రకుమార్, సూర్యనారాయణ, మురళి, క్రిష్ణ, సరోజమ్మ, మాధవి, విజయలక్ష్మి తదితరులు బాబా చిత్రపటాన్ని ఊరేగిస్తూ ఇంటింటా తిరిగి దత్తభిక్ష స్వీకరించారు.

ఉద్యోగోన్నతిపై బదిలీ

గోరంట్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ కార్యనిర్వాహణాధికారిగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యంకు పదోన్నతి కల్పించి రామగిరికి బదిలీచేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గోరంట్లలో గ్రేడ్ -1 పంచాయతీ సెకటరీగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యంను గ్రామ, వార్డు, సచివాలయాల నోడల్ ఆఫీసర్ (జీఎస్‌డబ్ల్యుఎస్)గా పదోన్నతి కల్పించింది. దీంతో ఆయన రిలీవ్ అయ్యారు. జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సాయిసంజయ్‌కు పంచాయతీ కార్యదర్శిగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన డీపీఓ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీపీఓ

గోరంట్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని వడిగేపల్లి గ్రామ సచివాలయాన్ని డీపీఓ సమత మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులు పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. గ్రామంలో సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న సమిత్వా సర్వే గురించి పరిశీలించి, సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమెతో పాటు సర్పంచ్ నరసింహమూర్తి, ఎంపీడీఓ కమలాబాయి, డిప్యూటీ ఎంపీడీఓ దేవదానం తదితరులు ఉన్నారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో డీపీఓ సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయిలో బుధవారం రైతన్న మీకోసం ఈనెల 5న మేగా పీటిఎంలు నిర్వహించడానికి ప్రత్యేకాధికారులను నియమించారు. కార్యక్రమాలను విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన అంశాలపై అధికారులతో సమీక్షించారు. సమావేశంలో ఆమెతో పాటు ఎంపీడీఓ కమలాబాయి, డిపైఈఓ జాన్‌రెడ్డెప్ప పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● టీడీపీ నాయకులు

రొద్దం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే తెలుగు దేశం పార్టీ ధ్యేయమని నాయకులు మాధవనాయుడు పేర్కొన్నారు. మంగళవారం సీఎస్ఆర్ నిధుల కింద గొబ్బరంపల్లిలో రూ.8.5లక్షలతో డ్రైనేజీ పనులకు, చోళేమర్రి నుంచి గొబ్బరంపల్లికి వెళ్లే చెరువు కట్టకింద రహదారి పనులకు రూ.14లక్షలతో పనులకు నాయకులు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అంటే టీడీపీ, టీడీపీ అంటేనే అభివృద్ధి అని అన్నారు. సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ చేపడుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, టైలర్ ఆంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ అరుణ్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు హరీష్, కన్వీనర్ నరహరి, వీరాంజనేయులు, వెంకటరామిరెడ్డి, అశ్వర్థనారాయణ, మారెప్ప, సర్పంచ్ జనార్దన్, మాజీ ఎంపీపీ చలపతి, మాజీ సర్పంచ్ కుల్లాయప్ప, రవి, నరసింహులు పాల్గొన్నారు.

పోస్టల్ ఇన్సూరెన్స్‌తో ఆర్థిక భరోసా

హిందూపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖలో ఇన్సురెన్స్ చేసుకోవడంవల్ల ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థికంగా ఆదుకుంటుందని తపాలాశాఖ హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ అన్నారు. రొళ్ల మండలానికి చెందిన శివకుమార్ ఈ యేడాది జనవరిలో విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. అయితే ఆయన ఇన్సురెన్స్ చేయించుకోవడంవల్ల అతనికి రూ.5.57లక్షలు ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. ప్రతి ఒక్కరూ తపాలాశాఖలో బీమా సౌకర్యం పొందాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మల్లికార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కల్యాణ్‌చక్రవర్తి

మడకశిర టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కల్యాణ్‌చక్రవర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మడకశిర తహసీల్దార్‌గా ఉన్న కరుణాకర్ పదవీవిరమణ చేయడంతో కొంతకాలం పరిగి తహసీల్దార్ హసీనాసుల్తానా ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొనసాగారు. జిల్లాకలెక్టర్ కల్యాణ్‌చక్రవర్తికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు.

దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి సోషల్ వికాస్ యోజన పథకంలో భాగంగా ఉచిత నైపుణ్యాభివృద్ధి సంస్థ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని మంత్రి సవిత ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కోర్సు అందుబాటులో ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు..

ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో స్కాలర్‌షిప్‌కోసం నిర్వహించే మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల సిబ్బంది కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ విద్యాసంస్థల మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఆదేశాల మేరకు డిసెంబరు 14న టెస్ట్ ఉంటుందన్నారు.

గృహనిర్మాణం కోసం..

గుడిబండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద గృహనిర్మాణం కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప తెలిపారు. ప్రభుత్వ గృహనిర్మాణం దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 14వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. అర్హులైన వారు హౌసింగ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అదేవిధంగా లబ్ధిదారులు ఆయా సచివాలయ సిబ్బందితో సొంత స్థలంలో ఫోటోలు తీయించుకుని జియోట్యాగింగ్ చేయించుకోవాలన్నారు.

మట్టి రోడ్లకు మహర్దశ

బీటీ రోడ్లకు రూ.25 కోట్లతో ప్రతిపాదనలు
రెండు రోడ్ల నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు
త్వరలో పనులు ప్రారంభం




పూలపల్లి రోడ్డు

మడకశిర, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మట్టిరోడ్లకు మహర్దశ రానుంది. ఆర్అండ్‌బీ పరిధిలోని మట్టిరోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు రూ. 25 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. రూ. 5 కోట్లు మంజూరు అయ్యాయి. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆర్అండ్‌బీ పరిధిలో మట్టిరోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు రూ.30 కోట్లు మంజూరు చేసింది. పనులు కూడా ప్రారంభం అయ్యాయి. కొద్ది రోజులకు ప్రభుత్వం మారడంతో 25శాతం జరిగిన పనులను సైతం రద్దు చేశారు. దీంతో 5 సంవత్సరాలుగా ఆ పనులు నిలబడి పోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పనులకు అధికారులు రూ.25 కోట్లతో తిరిగి ప్రతిపాదనలు పంపారు. అందులో బంద్రేపల్లి రోడ్డుకు, జంబులబండ నుంచి మేకలగట్ట రోడ్ల నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరు అయ్యాయి. టెండర్లు కూడా పిలిచారు. త్వరలోనే పనులు ప్రారంభంకానున్నాయని సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. జంబులబండ నుంచి మేకలకట్ట రోడ్డుకు రూ.5.50 కోట్లు, అమరాపురం నుంచి అగ్రహారం వయా పుల్లికుంట రోడ్డుకు రూ.5.90 కోట్లు, బంద్రేపల్లి రోడ్డుకు రూ.2 కోట్లు, పూలపల్లి నుంచి అగళి రోడ్డుకు రూ.3.5 కోట్ల మేరకు ఎస్టిమేషన్లు పంపారు. వలస నుంచి విరుపసముద్ర రోడ్డుకు రూ.4కోట్లు, నాచేపల్లి నుంచి హేమావతి వయా తంబాలహట్టి రోడ్డుకు రూ.4.5 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరుకావడం పట్ల ఆయాప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు వస్తే ఆ రోడ్ల ద్వారా వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేయడంతో రహదారుల రూపు రేఖలు మారనున్నాయని ఆ ప్రాంతవాసులు పేర్కొన్నారు.

రూ.25 కోట్లతో ప్రతిపాదనలు

నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ పరిధిలో మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు రూ. 25కోట్లతో ప్రతిపాదనలు పంపాం. బంద్రేపల్లి, జంబులబండ నుంచి మేకలగట్ట రోడ్ల నిర్మాణానికి రూ. 5కోట్లు మంజూరు అయ్యాయి. టెండర్లు పిలిచాం. త్వరలో పనులు ప్రారంభం అవుతాయి.
- మూర్తి, ఏఈ, ఆర్అండ్‌బీ, మడకశిర

వైభవంగా హనుమద్ వ్రతం



ప్రత్యేక అలంకరణలో పెనుకొండలోని ఊరువాకిలి ఆంజనేయస్వామి



రామాపురంలో ఆంజనేయస్వామికి వెన్నతో ప్రత్యేక అలంకరణ



పావగడలో స్వామివారికి కవచధారణ



గుడిబండలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ

పెనుకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): హనుమద్‌వ్రతం సందర్భంగా మంగళవారం ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. బోగసముద్రం చెరువు ఒడ్డున వెలసిన దక్షిణముఖ, వజ్రముష్టి, మిట్ట ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమద్‌వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

● **అగళి:** మండలంలోని రామాపురం గ్రామంలో మంగళవారం హనుమద్‌వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వెన్నతో అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

● **పావగడ:** హనుమద్ వ్రతాన్ని తాలూకా వ్యాప్తంగా అన్ని ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 5 గంటలకే సుప్రభాత సేవ, సూర్యారాధన, పంచామృతాభిషేకం, మన్యుసూక్త మధు అభిషేకం రుద్రాభిషేకం, మహాగణపతి, నవగ్రహ మృత్యుంజయ రామ తారక పవమాన హోమం తదితర పూజలను చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

● **గుడిబండ:** హనుమద్‌వ్రతం సందర్భంగా మండలంలోని కొంకల్లు గ్రామ సమీపంలో వెలసిన ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. పూజల అనంతరం ప్రత్యేక పూలతో స్వామివారిని అలంకరించారు. స్వామివారికి మహిళలు హారతులు మోసి మొక్కుబడులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

● **అమరాపురం:** తమ్మడేపల్లి, పుల్లికుంట, వలస, నడలుడం, హలుకూరు, ఆలదపల్లి, కనకనపల్లి గ్రామాల్లో హనుమద్‌వ్రతాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ఊరేగించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు



గుడిబండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మల మారెమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీఓ

గుడిబండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగతుర్పి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ కేశవరెడ్డి మంగళవారం పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థులు హాజరుశాతం, మెనూ, ఉపాధ్యాయులు హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో పలు ప్రశ్నలు వేసి సమాధానాన్ని రాబట్టారు. ఆయన వెంట ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి, సీఆర్పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మాక్ పార్లమెంట్‌లో ప్రతిభ



విద్యార్థిని పూజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పావగడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మాక్ పార్లమెంట్ పోటీల్లో పావగడ ఆదర్శ పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థిని పూజ నాలుగో స్థానం పొందింది. బెంగళూరులోని టీచర్స్ భవనంలో జరిగిన మాక్ పార్లమెంట్ సమావేశంలో రాణించి అందరి మన్ననలు పొందింది. హెచ్ఎం వెంకటేశులు, ఉపాధ్యాయ బృందం గిరీష్, దిలీప్, విజయ్‌కుమార్, రూప, విద్య తదితరులు విద్యార్థిని అభినందించారు.

కొమరేపల్లి సచివాలయం తనిఖీ

అగళి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సత్యసాయిజిల్లా గణాంకాల నోడల్ అధికారి ఖలందర్, ఉపగణన అధికారి గురురాజేంద్రప్రసాద్ మంగళవారం కొమరేపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇతర రాష్ట్రాలవారికి 3982 జనన ధృవీకరణ పత్రాలు మంజూరు చేశారని ఫిర్యాదు రావడంతో వారు సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆన్‌లైన్ ఓపెన్ కాకపోవడంతో ఈ విషయాన్ని ఎంపీడీఓ గంగాధర్‌తో మాట్లాడారు. పలు విషయాలు చర్చించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.



ఎంపీడీఓతో మాట్లాడుతున్న అధికారులు

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

● న్యాయాధికారి ఆర్. అశోక్‌కుమార్

మడకశిర టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఆర్.అశోక్‌కుమార్ సూచించారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో సీఐ, ఎస్ఐలతో న్యాయాధికారి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ.. రాజీకాదగ్గ కేసులను పరిష్కరించాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలోఓ అర్బన్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం మానుకోండి: టీడీపీ

మడకశిరటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అసత్య ప్రచారాన్ని వైసీపీ నాయకులు మానుకోవాలని టీడీపీ నాయకుడు, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ హితవు పలికారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. హోం మంత్రి అనిత మడకశిరలో పర్యటించినప్పుడు పోలీస్ సబ్‌డివిజన్ ఏర్పాటు చేస్తామని ఎక్కడా హామీ ఇవ్వలేదని, అయినా వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. హోంమంత్రి హామీ ఇచ్చి ఉంటే వీడియోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభు త్వం కొలువుదీరినప్పటి నుంచి జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే టీడీపీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, పట్టణ కన్వీనర్ నాగరాజు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మారుతి, మండల కన్వీనర్ నాగరాజు తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో ఎంపీ బీకే సోదరి మృతి

నివాళులు అర్పించిన నాయకులు

రొద్దం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అక్క రామాంజినమ్మ(80) అనారోగ్యంతో మృతిచెందింది. మంగళవారం రొద్దం మండల పరిధిలోని చిన్నమంతూరు గ్రామంలో ఆమె మృతిచెందగా విషయం తెలుసుకున్న ఎంపీ ఢిల్లీ నుంచి హుటాహుటిన బెంగళూరుకు విచ్చేసి రోడ్డుమార్గంలో చిన్నమంతూరుకు చేరుకున్నారు. ఎంపీ బీకే, భార్య కమలమ్మ, బంధువులు చిన్నమంతూరుకు చేరుకుని రామాంజినమ్మకు నివాళులు అర్పించారు.



నివాళులు అర్పిస్తున్న బీకే పార్థసారథి

మరమ్మతులు చేపట్టండి



తెగిన కల్వర్టు

అగళి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరిగేపల్లి గ్రామం వద్ద తెగిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. 5 ఏళ్ల క్రితం కురిసిన భారీ భారీ వర్షానికి కల్వర్టు పూర్తిగా తెగిందని, నేటికీ మరమ్మతులు చేపట్టలేదని వాపోతున్నారు. అగళి నుంచి శిర వరకు బస్సుల రాకపోకలు ఈ కల్వర్టు మీదనే జరిగాయని అయితే కల్వర్టు తెగిపోవడంతో రాకపోకలు హైవేపైనే జరుగుతున్నాయన్నారు. దీనివల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు అంటున్నారు. అదేవిధంగా అనుమనపల్లి గ్రామం దగ్గర కల్వర్టు తెగిందని, మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు అంటున్నారు. కల్వర్టులకు మరమ్మతులు చేయించి రాకపోకలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులను ఆయాప్రాంత గ్రామస్థులు కోరుతున్నారు.

9న బాలనాగమ్మ నాటక ప్రదర్శన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం గ్రామంలో ఈనెల 9న శ్రీకృష్ణదేవరాయ నాటక కళామండలి ఆధ్వర్యంలో బాలనాగమ్మ జానపద నాటకం ప్రదర్శిస్తున్నట్లు హాస్యకళాకారుడు కోగిర జయచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చేతులమీదుగా నాటకానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కళాకారులు కోనాపురం ఈశ్వరయ్య, నారాయణస్వామి, గోవిందు, నారాయణ, రామాంజినేయులు, తిమ్మయ్య, చంద్ర, నరసింహమూర్తి, నరసింహులు, రవికుమార్, టీడీపీ మాజీ జడ్పీటీసీ నాగలూరు నారాయణస్వామి పాల్గొన్నారు.

కాలువపల్లికి రహదారి నిర్మించండి: ఏఐడీవైఓ



వినతిపత్రం ఇస్తున్న ఏఐడీవైఓ నాయకులు

పరిగి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నో సంవత్సరాలుగా హిందూపురం-పరిగి ప్రధాన రహదారి నుంచి కాలువపల్లి గ్రామానికి వెళ్లేదారిని బీటీ రోడ్డుగా మార్చాలని ఏఐడీవైఓ నాయకులు కోరారు. పలు మార్లు అధికారులు, నాయకులకు వినతులు ఇచ్చినా ఎటువంటి ప్రయోజనం లేదని అన్నారు. నిత్యం ప్రయాణాలు సాగుతుంటాయని, శిథిలావస్థకు చేరుకున్న ఈ రహదారిపై చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలిచి ప్రయాణానికి తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. వెంటనే రహదారికి నిధులు కేటాయించి మరమ్మతులు చేయించి ప్రమాదాల బారినుంచి రక్షించాలంటూ ఏఐడీవైఓ యువజన సంఘం నాయకులు కాలువపల్లి గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి అరుణకు వినతిపత్రం అందించారు. ఆమె స్పందిస్తూ ఉన్నతాధికారులతో చర్చించి రహదారికి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రవి, మనోజ్, యశ్వంత్ పాల్గొన్నారు.

బాబయ్య ఉరుసులో తాగునీటి సరఫరా



ఉరుసులో తాగునీరు సరఫరా చేస్తున్న దర్గా ప్రతినిధులు

పెనుకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బాబయ్య ఉరుసు సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తుల సౌకర్యార్థం దర్గాపీఠాధిపతి సలావుద్దీన్‌బాబా ఆధ్వర్యంలో ఉచిత మినరల్ వాటర్ పంపిణీ చేపట్టారు. స్థానిక దర్గాసర్కిల్, దర్గాప్రాంగణం, ఆర్టీసీ బస్టాండు ఏరియా, రెవెన్యూ కార్యాలయం ప్రాంగణం, ఈద్గాప్రాంగణం తదితర ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా మినరల్ వాటర్‌ను సరఫరా చేస్తున్నారు.

మహిళకు గాయాలు

గోరంట్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పులేరు, జీనవాండ్లపల్లి సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు చేస్తున్న చతీస్‌ఘడ్ వాసి నేహా వాహనంపై నుంచి పడి మంగళవారం తీవ్రంగా గాయపడ్డారు. నేహా హైవే పనుల్లో కార్మికురాలిగా పనిచేస్తోంది. వాహనంపై ఉండగా డ్రైవర్ వాహనాన్ని ముందుకు నడపడంతో అదుపు తప్పి కిందకుపడిపోయింది. తలకు తీవ్రగాయమైంది. చెవిలో రక్తం వచ్చి అసస్మారక స్థితిలో ఉండటంతో గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ ఉషా చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం హిందూపురం పంపారు. ఈ విషయంపై ఆసుపత్రి వారు పోలీసులకు సమాచారం అందించారు.

ఆక్రమణలు జరగలేదు

తహసీల్దార్ షెక్షావలి, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్

రొళ్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఎం రాయాపురం పంచాయతీ, చిగమతిగట్ట గ్రామ పరిధిలోని చెరువులో ఆక్రమణలు జరిగినట్లు ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ షెక్షావలి, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ ఆ ప్రాంతాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చెరువులో ఎలాంటి నిర్మాణాలు జరగలేదన్నారు. అయితే వీటిని కొంతమంది గొర్రెల కాపరుల రాత్రివేళలో కంచెవేసుకుని ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటిని తొలగించాలని సూచించడం జరిగిందన్నారు. మండలంలో ఐదు మైనర్ ఇరిగేషన్ చెరువులు కొన్ని నీటి కుంటలు ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఏఎస్ఐ హిదాయతుల్లా పాల్గొన్నారు.



చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు